
సాక్షి నిర్మల్

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



'కడెం'కు కొనసాగుతున్న వరద

ఎగువ నుంచి వస్తున్న వరదతో జిల్లాలోని కడెం, గడ్డెన్నవాగు, స్వర్ణ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో అధికారులు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. IIలో▸



కొనసాగుతున్న ఉత్సవాలు

జిల్లాలో గణపతి నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వివిధ పూజలతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటున్నారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
29.0 / 23.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భైంసాటౌన్: పట్టణంలోని సుభద్రవాటిక శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు సైన్స్‌ఫేర్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఇటీవల ఆదిలాబాద్‌లో నిర్వహించిన విభాగ్‌స్థాయి విజ్ఞాన మేళా పోటీల్లో సైన్స్, మ్యాథ్స్ మోడల్స్, నూతన ఆవిష్కరణ, సైన్స్, వేద గణితం, క్విజ్, పద ప్రయోగాలు అంశాల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానాచార్యులు దేవేందర్ తెలిపారు. వీరు ఈనెల 12,13,14 తేదీల్లో కామారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం విద్యార్థులను పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పారిశుధ్య సమస్య పరిష్కరించాలి



పాఠశాల పరిసరాలు పరిశీలిస్తున్న శ్రీనివాస్

సారంగపూర్: పారిశుధ్య సమస్య పరిష్కరించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో బుధవారం ఆయన పారిశుధ్య పనులు, తాగునీరు, మురుగు కాలువలు, సెగ్రిగేషన్ షెడ్డు పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వాటర్ ట్యాంక్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సిబ్బందికి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు లబ్ధిదారులు, మేస్త్రీలతో సమావేశం నిర్వహించి వారికి సూచనలు చేయాలని ఎంపీవో అజీజ్‌ఖాన్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావుకు సూచించారు. సెగ్రిగేషన్ షెడ్డులో తయారైన ఎరువును పరిశీలించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్వర్ణ ప్రాజెక్టును పరిశీలించి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలు తెలుసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సోన్: సోఫీనగర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ కవిత ఓ ప్రకటనలో తెలిపారు. కామర్స్-1, కెమిస్ట్రీ-2, తెలుగు-1, ఇంగ్లిష్-1, మ్యాథ్స్-1, కంప్యూటర్ సైన్స్-2, జువాలజీ-1 పోస్టుల కోసం ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాంలో 55 శాతం మార్కులతోపాటు పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత గల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, జిరాక్స్ ధ్రువపత్రాలతో కళాశాలలో ఈ నెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 8న ఉదయం 10గంటలకు డెమో క్లాస్ ఉంటుందని తెలిపారు. బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 7036826353 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.


ప్రణాళిక ప్రకారం చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న భోజన్న

నిర్మల్ రూరల్: పదోతరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదవాలని డీఈవో భోజన్న సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈదుగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలు పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని చదువుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం నీరజారాణి, ఉపాధ్యాయులున్నారు.

స్ట్రీట్‌ఫుడ్ బండ్లు సీజ్



సీజ్ చేసిన బండ్లు తీసుకెళ్తున్న కమిషనర్

నిర్మల్ టౌన్: రోడ్డుపై ఏర్పాటు చేసిన స్ట్రీట్ ఫుడ్ బండ్లను బుధవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ సీజ్ చేశారు. వాటిని మున్సిపల్ సిబ్బంది ద్వారా కార్యాలయానికి తరలించారు. అనుమతి లేకుండా బండ్లను రోడ్లపై పెట్టి చెత్త వేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది అనూప్‌కుమార్, దేవిదాస్ తదితరులున్నారు.

వంట ఏజెన్సీల కష్టాలకు చెక్

- ఇక నెలనెలా బిల్లుల చెల్లింపు
- ప్రతీనెల 10వ తేదీ లోపు జమ
- అమలుకు అధికారుల కసరత్తు
- హర్షం వ్యక్తంజేస్తున్న కార్మికులు



జిల్లా కేంద్రంలోని కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట చేస్తున్న కార్మికులు (ఫైల్)

లక్ష్మణచాంద: సకాలంలో బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న ఏజెన్సీల కష్టాలు తీరనున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నెలనెలా 10వ తేదీలోపు గ్రీన్ చానెల్ ద్వారా బిల్లులు చెల్లించాలని నిర్ణయించింది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండురోజుల కిందట విద్యాశాఖపై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు

మధ్యాహ్న భోజన పథకం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయి. 1–5 తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.6.78 చొప్పున, 6–8 తరగతుల వారికి రూ.10.17 చొప్పున, 9,10 తరగతుల వారికి రూ.10.67 చొప్పున చెల్లిస్తారు. ఒక్కో కోడి గుడ్డుకు రూ.6 చెల్లిస్తున్నారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట కార్మికులకు కేంద్రం రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి ఇలా నెలకు రూ.3వేల గౌరవ వేతనం ఇస్తున్నాయి.

ఇప్పటివరకు చెల్లింపులు ఇలా..

నెలనెలా మధ్యాహ్నం భోజన బిల్లులను ముందుగా ప్రధానోపాధ్యాయుడు ఎంఈవో కార్యాలయానికి పంపుతారు. ఆ బిల్లులను మండల విద్యాధికారి జాగ్రత్తగా పరిశీలించి జిల్లా విద్యాధికారి కార్యాలయానికి పంపుతారు. అక్కడి అధికారులు పరిశీలించి డీఈవో ఆమోదంతో రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపితే అక్కడ నుంచి బిల్లుల నిధులు విడుదలవుతాయి. ఈ విధానంతో బిల్లుల చెల్లింపులు ఆలస్యం కావడంతో వంట ఏజెన్సీలు అప్పులపాలవుతున్నారు. దీంతో వారి ఇబ్బందులను తీర్చేందుకు ప్రభుత్వం గ్రీన్ చానెల్ ద్వారా నెలనెలా బిల్లులు చెల్లించాలని నిర్ణయం తీసుకుంది.

జిల్లా సమాచారం

మొత్తం పాఠశాలలు	830
విద్యార్థుల సంఖ్య	67,790
వంట ఏజెన్సీలు	830
వంట కార్మికులు	1,145

ఇక బిల్లుల చెల్లింపులు ఇలా..

మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు బిల్లులు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయంతో వంట కార్మికులకు నెలనెలా బిల్లులు అందుతాయని అధికారులు చెబుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు బిల్లులు పరిశీలించి ఆమోదించి వెంటనే ఎంఈవోకు ఆన్‌లైన్‌లో పంపిస్తారు. ఎంఈవో పరిశీలించి బిల్లులు సక్రమంగా ఉంటే వెంటనే ట్రెజరీ ద్వారా బిల్లు మొత్తం ప్రతినెల 10లోపు వంట కార్మికుల ఖాతాల్లో జమయ్యేలా చూస్తారు.

సకాలంలో బిల్లులొస్తే సంతోషమే..



మధ్యాహ్న భోజనం తయారు చేసే ఏజెన్సీలకు గ్రీన్ చానెల్ ద్వారా నెలనెలా 10లోపు బిల్లులు చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం మంచిదే. ఇక నుంచైనా మాకు నెలనెలా సకాలంలో బిల్లులు వస్తాయని ఆశిస్తున్నాం. – పోసవ్వ, వంట కార్మికురాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లక్ష్మణచాంద

అప్పుల బాధ తప్పుతుంది



మధ్యాహ్న భోజన బిల్లులు నెలల తరబడి రాకపోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు వంట చేసి పెడుతున్నాం. ప్రభుత్వం నెలనెలా బిల్లులు చెల్లిస్తామనడం సంతోషంగా ఉంది. ఇక నుంచి మాకు అప్పులు చేయాల్సిన బాధ తప్పుతుంది. – రాధిక, వంట కార్మికురాలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మాచాపూర్, లక్ష్మణచాంద మండలం

ఎమ్మెల్యేల క్షేత్రస్థాయి పర్యటన



బాసర: దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్



నర్సాపూర్ (జీ): దేవునిచెరువు కట్ట గండిని పరిశీలిస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



పెంబి: దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

బాసర: భారీ వర్షాలకు మండలంలో దెబ్బతిన్న పంటలను ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ బుధవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని రేణుకాపూర్ శివారు, బిద్రెల్లి, ఓని, మైలాపూర్ తదితర గ్రామాల్లో దెబ్బతిన్న సోయా, పత్తి పంటలు, ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాలు పరిశీలించారు. వ్యవసాయాధికారి అజయ్, తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డితో మాట్లాడి పంటనష్టం వివరాలు తెలుసుకున్నారు. తక్షణమే ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని బాధిత రైతులకు భరోసా కల్పించారు. పంట నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని, ఎకరాకు రూ.30వేల నుంచి రూ.40వేల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు సతీశ్‌రావు, సాయినాథ్, రమేశ్, ప్రతాప్‌రావు, నర్సింగరావు, శీనుయాదవ్, నారాయణరెడ్డి, సాయిబాబా, ఓని శివాజీ, దావా రాజు, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ (జీ) మండలంలో 'ఏలేటి'

నర్సాపూర్ (జీ): మండల కేంద్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. వర్షంలో తడుస్తూనే.. దేవుని చెరువు కట్టకు ఏర్పడిన గండిని పరిశీలించి మరమ్మతు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. దిగువన దెబ్బతిన్న పంటలను పరిశీలించి బాధిత రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు కట్ట తెగి చేపలు, వలలు కొట్టుకుపోయి తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని మత్స్యకారులు తెలుపగా.. పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేపట్టాలని పీఆర్, ఆర్‌అండ్‌బీ అధికారులు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఏఈకి సూచించారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఇరిగేషన్ ఏఈ గంగాధర్, పీఆర్ ఏఈ క్రాంతికుమార్, విద్యుత్ ఏఈ శంకర్, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏఈవో భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు నరేందర్, చిన్నయ్య, ముత్యంరెడ్డి, దత్తురాం, సుధాకర్, గంగారాం, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్ పటేల్, మహిపాల్, సాయన్న, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

పెంబి మండలంలో బొజ్జు

పెంబి: మండలంలోని తాటిగూడ గ్రామ శివారులో కడెం వాగు ప్రవాహ ప్రాంతంలో కొట్టుకుపోయిన పత్తి పంటను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకుంటుందని తెలిపారు. నష్టపోయిన ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మణ్, ఏవో నవీన్, నాయకులు శంకర్, రమేశ్, రాజన్న, మహేందర్, రమేశ్, భీంరావు, భూమేశ్ తదితరులున్నారు.

'కారు'లో కంగారు..!

- జిల్లాలో ఇప్పటికే బలహీనంగా పార్టీ
- కవిత సస్పెన్షన్‌తో అయోమయం
- 'సీబీఐ విచారణ' నిర్ణయంపై ఆందోళన

నిర్మల్: పదేళ్లపాటు జిల్లాలో దూసుకెళ్లిన కారు పార్టీకి గత ఎన్నికల ఫలితాలు బ్రేక్ వేశాయి. దీంతో సీనియర్లు, ముఖ్యనేతలంతా కారు దిగడంతో బీఆర్‌ఎస్ బలహీనపడింది. ప్రస్తుతం కొంతమంది ఉద్యమకారులు, కేసీఆర్ అభిమానుల కారణంగా కొన ఊపిరితో కొనసాగుతోంది. మళ్లీ.. జిల్లాలో పూర్వవైభవం సాధించేందుకు పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలను వాడుకోవాలని భావిస్తుండగా తాజాగా కల్వకుంట్ల కవిత, కాళేశ్వరంపై సీబీఐ విచారణ అంశాలు పార్టీని కంగారు పెడుతున్నాయి.

పదేళ్లపాటు అధికారం

రాష్ట్రం ఏర్పాటుతోనే అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ జిల్లానూ తన కైవసం చేసుకుంది. ఖానాపూర్, నిర్మల్, ముధోల్ మూడు నియోజకవర్గాల్లోని ప్రధాన నేతలంతా కారెక్కారు. ఎమ్మెల్యే నుంచి ఎంపీటీసీ దాకా ఏ ఎన్నిక వచ్చినా గులాబీ జెండాదే గెలుపు. నిర్మల్ నుంచి గెలిచిన ఇంద్రకరణ్‌రెడ్డి రెండుసార్లు రాష్ట్రమంత్రిగా కొనసాగారు. ఇక కారుకు ఎదురులేదు అని అనుకుంటున్న తరుణంలో 2023ఎన్నికలు ఆ పార్టీకి సడెన్‌బ్రేక్ వేశాయి.

బలపడ్డ బీజేపీ, కాంగ్రెస్

జిల్లాలో 2023 ఎన్నికల నుంచి బీఆర్‌ఎస్ తన ప్రాభవాన్ని కోల్పోగా, బీజేపీ, కాంగ్రెస్‌లు బలపడుతూ వస్తున్నాయి. ఆ ఎన్నికల్లో నిర్మల్, ముధోల్ నియోజకవర్గాలను బీజేపీ దక్కించుకున్నాయి. ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపొందింది. మూడుచోట్లా పదేళ్లపాటు బలంగా ఉన్న బీఆర్‌ఎస్ తన ప్రభావాన్ని ఏమాత్రం చూపించలేకపోయింది. రాష్ట్రంలో అధికారం కోల్పోవడం, జిల్లాలోనూ ఓడిపోవడంతో ప్రధాన నేతలతో పాటు క్యాడర్ కారుదిగి, కాంగ్రెస్, బీజేపీల్లో చేరిపోయారు.

అంతా అయోమయం

ఇప్పుడిప్పుడే మళ్లీ పార్టీకి మంచిరోజులు వస్తున్నాయని బీఆర్‌ఎస్ క్యాడర్ బలంగా నమ్ముతున్న తరుణంలో మరింత బలమైన దెబ్బలు ఎదురవుతున్నాయి. ఓవైపు కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి చోటుచేసుకుందని, దీనిపై సీబీఐతో విచారణ చేయిస్తామని అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్టీలోని ముఖ్యనేతలైన హరీశ్‌రావు, సంతోష్‌రావుపై బలమైన ఆరోపణలు చేయడంతో పార్టీ ఆమెను సస్పెండ్ చేసింది. ఇలా వరుస ఘటనలు కారు పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కాళేశ్వరం విచారణ అంశంపై మంగళవారం జిల్లాలోనూ పార్టీశ్రేణులు ఆందోళన చేపట్టాయి. కానీ.. 'కారు'లో ఇంటిపోరు రసవత్తరంగా మారుతుండటంతో జిల్లాలో అంతంత మాత్రంగా ఉన్న పార్టీ ఇక ఎటుపోతుందనే అయోమయం నెలకొంది.

ఇప్పుడిప్పుడే ఆశలు

ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, జెడ్పీటీసీ సభ్యులుగా గెలిచి పదవులు అనుభవించిన వాళ్లు పార్టీని వీడినా కొంతమంది మాత్రం కారు దిగలేదు. తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్‌పై అభిమానంతో వారంతా అలాగే పార్టీలో కొనసాగుతున్నారు. రానున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో తమపార్టీ సత్తా చాటుతుందని, మళ్లీ పూర్వవైభవం వస్తుందని వారు నమ్ముతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, ఇదంతా తమకు కలిసి వస్తుందన్న భావన వారిలో ఉంది. కాగా, పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన కొంతమంది సీనియర్ నాయకులు మళ్లీ బీఆర్‌ఎస్‌వైపే చూస్తున్నారని వారు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

రాయితీ యంత్రం.. రైతుకు ఊతం

- యాంత్రీకరణ పథకం మళ్లీ ప్రారంభం
- జిల్లాకు 4,454 యూనిట్ల కేటాయింపు
- రూ.3.35కోట్లు విడుదల చేసిన సర్కారు
- అక్టోబర్ చివరి వారంలో పంపిణీ



నిర్మల్‌చైన్‌గేట్: రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేసే యాంత్రీకరణ పథకానికి నిధులు మంజూరయ్యాయి. జిల్లాకు రూ.3.35 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. సబ్మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్‌ఎంఏఎం) పథకం కింద ఈ నిధులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వానిది 60 శాతం వాటా కాగా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తుంది. గత యాసంగిలోనే ప్రక్రియ ప్రారంభించినా మార్చి బడ్జెట్ ముగింపు సందర్భంగా ఏర్పడిన సాంకేతిక కారణాలతో నిధులు విడుదల కాలేదు. ప్రస్తుతం ముందస్తుగానే ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

ఎంపిక బాధ్యత కమిటీలదే

వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందజేసేందుకు జిల్లా, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. రాయితీ రూ.లక్ష దాటితే జిల్లా కమిటీ ఆమోదం తప్పనిసరి. ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న వారు ఈ రాయితీ పథకానికి అర్హులు. జిల్లా కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఏవో, ఆగ్రోస్, ఎల్డీఎం, శాస్త్రవేత్త సభ్యులుగా ఉండనున్నారు. మండల స్థాయి కమిటీలో మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్, ఎంపీడీవోలు ఉంటారు. ఈ పరికరాల కోసం అర్హులను ఈ కమిటీలు ఎంపిక చేయనున్నాయి. 2017–18 సంవత్సరం వరకు యాంత్రీకరణ పథకం అమలులో ఉంది. మళ్లీ ఏడేళ్ల తర్వాత పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. గతంలో ట్రాక్టర్లు అందించగా, ఈ ఏడాది యాంత్రీకరణ పనిముట్ల వరకే పరిమితం చేశారు.

సబ్సిడీ.. పనిముట్ల వివరాలు

ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పనిముట్లలో మహిళా రైతులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం సబ్సిడీపై పరికరాలు అందించనున్నారు. మిగతా రైతులకు 40శాతం సబ్సిడీ వర్తిస్తుంది. ఐదెకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లు, ట్రాక్టర్‌తో వినియోగించే రొటోవేటర్లు, నాగళ్లు, కలుపుతీసే యంత్రాలు, పవర్ టిల్లర్లు, మొక్కజొన్న తీసే యంత్రాలు తదితర పరికరాలు అందజేసేందుకు చర్యలు చేపడతారు.

జిల్లాకు కేటాయించిన సబ్సిడీ పరికరాలు

యంత్రాల పేర్లు	యూనిట్లు	నిధులు (రూ.లక్షల్లో)
బ్యాటరీ, చేతి, మ్యానువల్స్ స్ప్రేయర్లు	3,238	32.38
పవర్ నాప్ సాక్ స్ప్రేయర్లు	525	52.50
రొటోవేటర్లు	239	119.50
విత్తన ఫర్టిలైజర్ వేసే యంత్రాలు (గొర్రు)	50	15.00
ట్రాక్టర్ పరికరాలు	290	58.00
బండ్ ఫార్మర్లు	6	0.90
పవర్ వీడర్స్	50	17.50
బ్రష్ కట్టర్లు	41	14.35
పవర్ టిల్లర్స్	25	25.00

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



బామ్నికేలో పిల్లల బరువు పరిశీలిస్తున్న అలోక్‌శర్మ

లోకేశ్వరం: మండలంలోని బామ్నికే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సుపోషిత్ జీపీ అభియాన్ కేంద్ర బృందం సభ్యుడు అలోక్‌శర్మ బుధవారం పరిశీలించారు. కేంద్రంలోని చిన్నారుల పోషణ స్థితి, అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే ఆహార పదార్థాల నాణ్యత, పిల్లల బరువు పరిశీలించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు అధికసంఖ్యలో వచ్చేలా చూడాలని సూచించారు. సీడీపీవో స్టేట్ కన్సల్టెంట్ విజయ తాపక్, స్టేట్ కన్సల్టెంట్ అశోక్, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ నిరంజన్‌రెడ్డి, ముథోల్, ఖానాపూర్, నిర్మల్ సీడీపీవోలు సరోజిని, నాగలక్ష్మి, సరిత, సెక్టార్ సూపర్‌వైజర్ మీనా, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వనమహోత్సవం, గ్రామాల్లో పారిశుధ్య పనులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశమై మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని, ఇసుక కొరత రాకుండా చూడాలని సూచించారు. డబ్బులు లేని లబ్ధిదారులకు మహిళా స్వయం సంఘాల ద్వారా రుణాలు ఇప్పించాలని తెలిపారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమాన్ని వెంటనే పూర్తిచేయాలని, మొక్కలు నాటిన వెంటనే సంబంధిత సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో మొక్కలు నాటే ప్రక్రియ దాదాపు పూర్తయిందని, మిగతా లక్ష్యాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇటీవల భారీ వర్షాలు కురిసినందున గ్రామాల్లో మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫాగింగ్ చేయించాలని, నీరు అధికంగా నిల్వ ఉండే చోట దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్‌బాల్స్ వేయాలని తెలిపారు. ఇటీవల వర్షాలు కురిసి వరదలు సంభవించిన నేపథ్యంలో క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టిన అధికారులందరినీ అభినందించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీపీవో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దిగుమతి సుంకాలు ఉపసంహరించుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపైన 11శాతం దిగుమతి సుంకాలను ఉపసంహరించుకోవాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంది రామయ్య డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పత్తి రైతులకు నష్టం చేకూర్చేలా వివిధ దేశాల్లో వచ్చే పత్తికి దిగుమతి సుంకాలను తగ్గిస్తూ మన దేశ రైతులకు నష్టమయ్యే పరిస్థితిని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువస్తోందని ఆరోపించారు. ఓ వైపు పెట్టుబడులు రాక, గిట్టుబాటు లేక పత్తి రైతులు ఆందోళన చెందుతుంటే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్, జిల్లా అధ్యక్షుడు తిరుపతి, నాయకులు భూక్య రమేశ్, నాగెల్లి నర్సయ్య, గోరెబాయ్, బీ నర్సయ్య, నారాయణ, భీమేశ్, రాజేశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన బోసు భూమన్నకు చెందిన పోడు భూమిలోని మామిడి చెట్లను జేసీబీతో తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అటవీ అధికారులు పోడు రైతులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి భూక్య రమేశ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి తదితరులు పాన్నారు.

'మత్తడివాగు' గేటు ఎత్తివేత



ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని వడ్డాడి వద్ద గల మత్తడివాగు ప్రాజెక్టులోకి వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో సాయంత్రం ప్రాజెక్టు ఒక గేటును ఎత్తి 1,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా ప్రస్తుతం 276.90 మీటర్ల వద్ద నిల్వ ఉండేలా నీటిని వదులుతున్నట్లు ఏఈ హరీశ్ కుమార్ తెలిపారు. **– తాంసి**

స్వర్ణ ప్రాజెక్టు నీటి విడుదల



ఎగువన కురుస్తున్న వర్షాలకు నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులోకి 550 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు బుధవారం ఒక గేటును ఎత్తి 985 క్యూసెక్కుల నీటిని దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు కాగా ప్రస్తుతం 1182.1 అడుగుల వద్ద స్థిరంగా ఉంచుతున్నామని అధికారులు పేర్కొన్నారు. **– సారంగపూర్**

'సాత్నాల' గేటు ఎత్తివేత



ఎగువన కురుస్తున్న వర్షాలకు సాత్నాల ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో బుధవారం 1,495 క్యూసెక్కుల నీరు రావడంతో ఒక గేటు ఎత్తి 1,386 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు ప్రాజెక్టు జేఈ దీపక్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.24 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.046 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. **– సాత్నాల**

'గడ్డెన్నవాగు'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



భైంసా పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువన కురిసిన వర్షాలకు బుధవారం ప్రాజెక్టులోకి 648 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ప్రాజెక్టు అధికారులు ఒక గేటు ఎత్తి 3,300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా ప్రస్తుతం 358.30 మీటర్ల నీరు నిల్వ ఉంచి నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. **– భైంసాటౌన్**

పెన్‌గంగలో వరద ఉధృతి

- మహారాష్ట్రకు నిలిచిన రాకపోకలు



హుడ్కిలి వంతెనపై రాకపోకలు నిలిపివేస్తున్న పోలీసులు



వెంకట్రావ్‌పేట్- పోడ్సా వద్ద అంతర్రాష్ట్ర వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

సిర్పూర్(టి): కుమురంభీం జిల్లాతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు పెన్‌గంగ నదిలో వరద ఉధృతి పెరిగింది. బుధవారం సిర్పూర్(టి)– మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలోని హుడ్కిలి వంతెన పైనుంచి, సిర్పూర్(టి) మండలంలోని వెంకట్రావ్‌పేట్– పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిలోని పోడ్సా వంతెన పైనుంచి వరద ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఆయా రహదారుల గుండా మహారాష్ట్రకు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. సిర్పూర్(టి) మండలం హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి గ్రామాలతో పాటు మహారాష్ట్రకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు పెన్‌గంగ నది పరీవాహక ప్రాంతాల వైపు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసులు, అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

'కడెం'కు కొనసాగుతున్న వరద



కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు బుధవారం రాత్రి 28,174 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఇరిగేషన్ అధికారులు మూడు వరద గేట్లను ఎత్తి 18,550 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 696.750 అడుగుల నీటిమట్టం ఉంది.

ఉప్పొంగిన తర్ణం వాగు



ఉప్పొంగి ప్రవహిస్తున్న తర్ణం వాగు

సాత్నాల: ప్రజాప్రతినిధులు, అధికారులకు ముందుచూపు లేకపోవడంతో చిరుజల్లు కురిసినా భోరజ్ మండలంలోని తర్ణం వాగు జాతీయ రహదారి 353 బీపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. రూ.4.5 కోట్లతో లో లెవెల్ వంతెన నిర్మించినా ఉపయోగం లేకుండా పోయింది. బుధవారం కురిసిన చిరుజల్లులకు లోలెవల్ వంతెనపై నీరు ప్రవహిస్తుండడంతో ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయి విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చే రోగుల పరిస్థితి మరి దయనీయంగా మారింది.

క్లుప్తంగా

వర్షానికి కూలిన ఇల్లు



కూలిన ఇంటి వద్ద బాధితులు

నెన్నెల: మండలంలోని నందులపల్లిలో కుమ్మరి మొండికి చెందిన పెంకుటిల్లు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్ బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

తలమడుగు: మండలంలోని పల్సి(బి) తండాలో పేకాడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి రూ.1,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైన్స్‌లో చోరీ

ముధోల్: మండల కేంద్రంలోని రాజరాజేశ్వర్ వైన్స్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. వైన్స్ సిబ్బంది రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లారు. బుధవారం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. యజమాని ఫిర్యాదుతో ఎస్సై బిట్ల పెర్సిస్ షాపును పరిశీలించారు. రూ.13,230 నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. మూడు నెలల క్రితం ఇదే వైన్స్‌లో చోరీ జరిగి రూ.3లక్షల విలువైన మద్యం ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

7న బాసర ఆలయం మూసివేత

బాసర: ఈ నెల 7న ఆదివారం సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా మధ్యాహ్నం ఒంటిగంటకు మహా నివేదన, హారతి అనంతరం బాసర ఆలయంతో పాటు అన్ని ఉపాలయాలు మూసివేయనున్నట్లు ఈవో తెలిపారు. సోమవారం ఉదయం 4 గంటలకు యథావిధిగా ఆలయం తెరిచి మహా సంప్రోక్షణ నిర్వహిస్తారన్నారు. ఉదయం 7:30 గంటల నుంచి అన్ని ఆర్జిత సేవలు ప్రారంభమవుతాయని, భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

స్వీట్ హౌస్ సీజ్



శాంపిళ్లు సేకరిస్తున్న అధికారులు

దహెగాం: పాడైపోయిన బాదుషాలు విక్రయించిన మండల కేంద్రంలోని ఓ స్వీట్‌హౌస్‌ను సీజ్ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని ముత్యంపేట శ్రీ గణేశ్ మండపం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు మండల కేంద్రంలోని శ్రీబాలాజీ స్వీట్‌హౌస్‌లో 20 కిలోల బాదుషాలు ఆర్డర్ ఇచ్చారు. వాటిని తీసుకెళ్లి వడ్డిస్తుండగా అందులో కొన్ని కుళ్లిపోయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే యువకులు షాపు యజమాని దృష్టికి తీసుకెళ్లగా పొంతనలేని సమాధానం ఇచ్చాడు. దీంతో ఆగ్రహానికి గురైన యువకులు స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు డీటీ గణేశ్, ఆర్ఐ నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు స్వీట్ హౌస్‌లో తనిఖీలు నిర్వహించి షాపును సీజ్ చేశారు. విషయాన్ని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో శాంపిల్ టేకర్ మల్లికార్జున ఆధ్వర్యంలో చెడిపోయిన బాదుషాలతో పాటు ఇతర వస్తువులు సేకరించారు. వాటిని ల్యాబ్‌కు పంపిస్తామని, రిపోర్ట్ వచ్చిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మండపాల వద్ద పేకాట ఆడితే కఠిన చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: గణేశ్ మండపాల వద్ద పేకాట ఆడినా, కేటీ తీసినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల్లో ఆదిలాబాద్ పట్టణంలో పేకాట ఆడిన 20 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మూడు కేసుల్లో 13 మొబైల్ ఫోన్లు, ఒక కారు, ఐదు ద్విచక్ర వాహనాలు, రూ.82,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వన్‌టౌన్, టూటౌన్, మావల పోలీసు స్టేషన్‌లలో ఒకటి చొప్పున కేసులు నమోదైనట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఆర్డీవోకు సిఫార్సు చేసి భవనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతీరోజు మండపాలను సెక్టర్, క్లస్టర్ పోలీసు అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

కూతుర్ని కిడ్నాప్ చేసిన తండ్రి

- సాయంత్రం ఆలయంలో వదిలివెళ్లిన వైనం

నిర్మల్‌టౌన్: కుటుంబ కలహాల కారణంగా కుమార్తెను తండ్రి కిడ్నాప్ చేసిన ఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసాకు చెందిన అంజయ్యకు జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌కు చెందిన మణితో 11 ఏళ్లక్రితం వివాహమైంది. దంపతులకు నాలుగేళ్ల కుమార్తె సంతానం. కుటుంబ కలహాలతో కొంతకాలంగా దంపతులు దూరంగా ఉంటున్నారు. బుధవారం ఉదయం మద్యం మత్తులో ఉన్న అంజయ్య భార్య ఇంటికి వచ్చి కూతుర్ని ఎత్తుకెళ్లాడు. దీంతో అతని భార్య మణి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనకు న్యాయం జరగడం లేదని అంజయ్య భార్య మణి కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసింది. తమ కూతుర్ని రక్షించాలని వేడుకుంది. కాగా బుధవారం సాయంత్రం అంజయ్య తమ కూతుర్ని తీసుకువచ్చి బాధితురాలి ఇంటి సమీపంలో ఉన్న హనుమాన్ ఆలయంలో వదిలివెళ్లినట్లు సీఐ తెలిపారు.

అదుపుతప్పి లోయలోపడిన కారు



సంఘటన స్థలంలో కారు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ శివారులో మంగళవారం రాత్రి ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న లోయలో పడింది. దీంతో కారులో ఉన్న కడెం మండల కేంద్రానికి చెందిన బాలిక అనన్యతో పాటు చందు, ప్రసాద్, దేవాన్స్‌లకు గాయాలయ్యాయి. 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ కృష్ణ, పైలట్ అజర్ హుస్సేన్ తెలిపారు. కాగా బాధిత కుటుంబ సభ్యులు మహారాష్ట్రలోని పాలజ్‌కు వెళ్లి వస్తుండగా ఘటన చోటు చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు.

మహారాష్ట్ర సరిహద్దులో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు మృతి, ఇద్దరికి గాయాలు
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

తానూరు: మహారాష్ట్ర సరిహద్దులోని బోకర్ తాలూకా నందా గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నిజామాబాద్ జిల్లా వర్ని మండలం హున్సపూర్ గ్రామానికి చెందిన దంపతులు చేకూరి బుల్లిరాజు (50), సునీత (45), బంధువైన బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన వాణి (40), మరో ఇద్దరితో కలిసి బుధవారం ఉదయం కారులో మహారాష్ట్రలోని బాలాజీ కర్ర వినాయకుని దర్శించుకునేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తెలంగాణ సరిహద్దులోని మూడు కిలోమీటర్ల దూరంలో గల నాందా గ్రామ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. దీంతో కారులో ఉన్న రాజు, సునీత, వాణి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మహారాష్ట్రలోని బోకర్ ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

రామకృష్ణాపూర్: పట్టణంలో ని శ్రీనివాసనగర్‌కు చెందిన కుశ్నపల్లి నవీన్ (33)బుధవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభించటం.. అందులో తన ఆవేదనను వెలిబుచ్చుతూ కుటుంబసభ్యులందరినీ ఉద్దేశించి రాయటం పలువురిని కలిచివేసింది. 'అందరూ నన్ను క్షమించండి.. నాభార్య పిల్లలను మంచిగా చూసుకోలేకపోతున్నా, దీనికి తోడు నేను చేసిన చిన్నపాటి అప్పులు కూడా సంకటంగా మారాయి' అంటూ లేఖలో పేర్కొంటూ ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనాస్థలిని పట్టణ ఎస్సై రాజశేఖర్ సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడు..

భైంసాటౌన్: పట్టణంలోని పూలేనగర్‌కు చెందిన అక్వీత్‌వార్ గంగారెడ్డి (65) బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నాగభూషణ్, స్థానికుల కథనం ప్రకారం.. వృద్ధుడు స్థానికంగా బట్టల దుకాణంలో గుమాస్తాగా పని చేస్తుండగా భార్య మూడేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. కుమారుడు సైతం కొన్నేళ్ల క్రితం చనిపోగా కూతురికి పెళ్లయింది. గంగారెడ్డి అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఒంటరితనం భరించలేక మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. సమాచారమందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మహిళను వేధించిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మహిళను వేధించిన ముగ్గురు ఆకతాయిలపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్సై బి.సుశీల తెలిపారు. బుధవారం వివరాలు వెల్లడించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలపై వేధింపులను అరికట్టేందుకు షీటీమ్ బృందాలు అందుబాటులో ఉంటూ ప్రజలతో మమేకమై తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేశ్ మండపాలను తిలకించేందుకు వచ్చిన మహిళను వేధిస్తున్న ముగ్గురిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిలో ఖానాపూర్‌కు చెందిన బబ్లు, బొక్కల్‌గూడకు చెందిన అవేజ్, కుమ్మర్‌వాడకు చెందిన సంతోష్ ఉన్నట్లు తెలిపారు. వేధింపులకు గురైన మహిళలు, యువతులు డయల్ 100, షీటీమ్ 7812659953 నంబరులో సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట షీటీమ్ బృందం సభ్యులు వాణిశ్రీ, మహేష్, రోహిని, లావణ్య, తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఒకరిపై..

వాంకిడి: గంజాయి విక్రయిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్న వాంకిడి గ్రామానికి చెందిన వడై చంద్రశేఖర్ బుధవారం గంజాయి అమ్ముతూ పట్టుబడ్డాడు. అతన్ని తనిఖీ చేయగా 140 గ్రాముల ఎండు గంజాయి లభించింది. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

దొంగల హల్‌చల్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి దొంగల్ హల్‌చల్ చేశారు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని మూడు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. తాంసి బస్టాండ్ ప్రాంతంలోని రాశెట్టివార్ సంతోష్ కిరాణ దుకాణంలో చొరబడి రూ.12వేల నగదు ఎత్తుకెళ్లారు. రిమ్స్ ఆస్పత్రి పక్కన గల శశాంక్ మెడికల్‌లో షట్టర్ పగలగొట్టి రూ.3వేల విలువ గల డీవీఆర్ సీసీ కెమెరాలను అపహరించారు. బాలాజీ వైన్స్‌షాప్‌లో కౌంటర్‌లో ఉన్న రూ.2వేలు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ నాగరాజు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

'జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలి'



మాట్లాడుతున్న గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: ఉప రాష్ట్రపతిగా పోటీ చేస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి పౌర సమాజం మద్దతుగా నిలవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ కోరారు. బుధవారం మావల మండలంలోని కుమురంభీం గూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య భవిష్యత్ దృష్ట్యా సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా నిలబడాలని పార్లమెంట్ సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పార్టీవాళ్లకే ఓటు వేయాలని నిబంధన రాజ్యాంగంలోనూ ఎక్కడా లేదన్నారు. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధంగా తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం గణపతి, మావల మండల అధ్యక్షుడు వెడ్మ ముకుంద్, నాయకులు రమేశ్, రాంకిషన్ పాల్గొన్నారు.

దూరవిద్యలో పీవీటీజీలకు ఉచిత ప్రవేశం

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

ఆదిలాబాద్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ద్వారా అందిస్తున్న కోర్సుల్లో ఆదిమ గిరిజనులు (పీవీటీజీ)లకు ఉచితంగా ప్రవేశం కల్పించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టూడెంట్ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా, వివిధ కారణాలతో ఉన్నత చదువు కొనసాగించని వారికి ఇది ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సమతా సపోర్ట్ స్కీమ్ కింద కొలాం, కోయ, కొండరెడ్డి, గోండు, తోటి కులాల వారు కేవలం రూ.500 తోనే అడ్మిషన్ పొందవచ్చన్నారు. దివ్యాంగులకు సైతం అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. త్వరలో ఉమెన్ హబ్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఉట్నూర్‌లో స్టడీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిగ్రీ, పీజీ అడ్మిషన్ కోసం ఈనెల 12 వరకు గడువు ఉందన్నారు. ఆదిలాబాద్‌లోని అధ్యయన కేంద్రంలో కొత్తగా సైన్స్‌కు సంబంధించిన పీజీ కోర్సు, లైబ్రరీ కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అంతకుముందు కోర్సులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన వెంట ప్రొఫెసర్లు గుంటి రవీందర్, పరాంకుశం, వెంకటరమణ, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ జగ్‌రాం అంతర్వేది, తదితరులు ఉన్నారు.

ఉట్నూర్ కళాశాలను సందర్శించిన యూనివర్సిటీ బృందం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లో స్టడీ సెంటర్ ఏర్పాటు కోసం బుధవారం యూనివర్సిటీ బృందం సభ్యులు వెంకటేశ్వర్లు, రవీందర్ కేబీ ప్రాంగణంలోని డిగ్రీ కళాశాలను సందర్శించినట్లు ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు.

చిరుతదాడిలో ఎద్దు మృతి

- ఊపిరాడక మరొకటి..

తానూరు: చిరుతపులి దాడిలో రెండు ఎద్లు మృతి చెందిన సంఘటన మండలంలోని మసల్గాతండాలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జాదవ్ దేవిదాస్ మంగళవారం రోజంతా తమ ఎద్లను మేపి సాయంత్రం పొలంలోనే కట్టేసి ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలోచిరుతపులి ఒక ఎద్దుపై దాడిచేసి హతమార్చింది. ఈక్రమంలో భయాందోళన చెందిన మరో ఎద్దు తప్పించుకునే క్రమంలో మెడకు ఉరిపడి ఊపిరాడక మృతి చెందింది. బుధవారం ఉదయం సదరు రైతు పొలానికి వెళ్లి చూడగా రెండు ఎద్లు మృతిచెంది కనిపించాయి. చిరుతపులి ఆనవాళ్లు కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. ఎఫ్ఆర్వో రమేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుతదాడిలో ఎద్దు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

ప్రభుత్వ ఉద్యోగిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానని ఓ నిరుద్యోగి వద్ద డబ్బులు వసూలు చేసిన ప్రభుత్వ ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఖానాపూర్‌కు చెందిన ముఖీద్ అహ్మద్ టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నిరుద్యోగి లావణ్య వద్ద రూ.45వేలు తీసుకున్నాడు. రూ.లక్షకు బేరం కుదుర్చుకొని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. గతేడాది డిసెంబర్ 16న డబ్బులు తీసుకోగా అప్పటి నుంచి ఉద్యోగం ఇప్పించకపోగా, తీసుకున్న డబ్బులు కూడా ఇవ్వకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

జాతీయస్థాయి శిక్షణకు ఎంపిక



జాడి శ్రీనివాస్

నిర్మల్‌ఖిల్లా: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020)లో భాగంగా జాతీయస్థాయిలో నిర్వహించనున్న శిక్షణకు తెలంగాణ రాష్ట్రం నుంచి 10 మంది ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. అందులో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జాడి శ్రీనివాస్‌కు చోటు దక్కింది. ఈనెల 8 నుంచి 27 వరకు హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఉపాధ్యాయుల జాబితాతో కూడిన ఉత్తర్వులను బుధవారం ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జి.రమేశ్ జారీ చేశారు. జాడి శ్రీనివాస్ గత మే నెలలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బోధనాభ్యసన ప్రక్రియల్లో బెస్ట్ ప్రాక్టీసెస్ విభాగంలో ఎంపికై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రదర్శననిచ్చారు.

ఎస్పీఎంలో ప్రమాదం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సిర్పూర్ పేపరు మిల్లులో బుధవారం ఫైబర్‌లైన్ లీక్ కావడంతో సమీపంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుడు ఎన్నం భాస్కర్ వీపుపై కెమికల్ పడి వెనకభాగం పూర్తిగా కాలిపోయింది. గమనించిన తోటి కార్మికులు ముందుగా స్థానిక ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు.